క్లుప్తంగా

ఎడతెరిపి లేని వర్షం



చిలుకూరులో పొలాల్లో నిలిచిన వర్షపునీరు

చిలుకూరు : మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మఠంపల్లి : మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్‌నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తతండా, కాల్వపల్లితండాలలోని వీధులలో ఆయన పర్యటించి పరిసరాలు, డ్రెయినేజీ పరిశుభ్రంపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయా బాలానాయక్, సుజాతానక్రునాయక్, కార్యదర్శులు, వైద్యసిబ్బంది, తదితరులు ఉన్నారు.

గేదెల ఆచూకీ తెలిపితే రూ.10వేల బహుమతి

మునగాల : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గడ్డం వెంకటరెడ్డికి చెందిన ఆరు గేదెలు నెల రోజుల క్రితం తప్పిపోయాయి. ఆచూకీ తెలిపిన వారికి రూ.పదివేలు బహుమతిగా ఇస్తామని వెంకటరెడ్డి కుమార్తె, మునగాల ఎంపీపీ ఎలక బిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 170019, 222824, 222722, 222813 ట్యాగులు గల గేదెలు కనిపిస్తే సెల్ నంబర్లకు 9705203801, 98487 52420 సమాచారం ఇవ్వాలని కోరారు.

రైతు సమన్వయ సమితి క్లస్టర్ కోఆర్డినేటర్‌గా వీరభద్రయ్య

చిలుకూరు : రైతు సమన్వయ సమితి నారాయణపురం క్లస్టర్ కోఆర్డినేటర్‌గా నారాయణపురం గ్రామానికి చెందిన మేకల వీరభద్రయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ తనకు నియామకపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొండా సైదయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబుకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

గడపగడపకు పథకాలు



కూచిపూడితండాలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోదాడరూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళదామని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల రామారావు, ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కూచిపూడితండాలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భుక్యా సైదా, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాబురావు, పున్నిబాయి, లక్యా, సుఖ్యా, సాగర్, సైదా, బాబు, రామచంద్రు, వీరయ్య తదితరులు ఉన్నారు.

డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో నేడు ఉచిత వైద్య శిబిరం

పాలకవీడు : మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ పాఠశాల ఆడిటోరియంలో మిర్యాలగూడెం బాలాజీ ఆస్పత్రి వారు శనివారం ఏర్పాటు చేయబోయే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డెక్కన్ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె, కంటి సమస్యలు, మహిళలకు గర్భకోశ, ఎముకల సమస్యలపై పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

భోజనశాల నిర్మాణానికి సిమెంట్ అందజేత

నడిగూడెం : నడిగూడెంలో శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన రణబోతు శ్రీనివాసరెడ్డి –లలిత దంపతులు శుక్రవారం ఆలయ కమిటీకి రూ.18 వేల విలువైన 50 సిమెంట్ కట్టలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీర్ల పండగ

హుజూర్‌నగర్ : పట్టణంలో పీర్ల పండుగ కొనసాగుతోంది. శుక్రవారం మూడవ షరగతిలో భాగంగా యాదవ సంఘ నాయకులు మాజీ చైర్మన్ జక్కుల వెంకయ్య, జక్కుల మల్లయ్య, నరేందర్‌లు మూడవ రోజు కార్యక్రమాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం చందమామ పీరును ముజావర్ షేక్ సైదా గౌడ కుల అధ్యక్షులకు అందజేశారు. పీర్ల కొట్టంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పీరును గుండం చుట్టూ తిప్పి ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సొసైటీ చైర్మన్ వి.కృష్ణ గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్, మట్టయ్య, శ్రీను, గోవింద్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని రాష్ట్రంలో తిరగనివ్వం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం రైతు వేదికలో మాట్లాడుతున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



చిలుకూరు : బేతవోలులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య

నడిగూడెం : తెలంగాణలో రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ ఇస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే విద్యుత్ సరఫరాపై అసత్య ఆరోపణలు చేస్తోందని, మూడు గంటల విద్యుత్ చాలని చెప్తూ రైతులను మోసం చేయాలని చూస్తున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని తెలంగాణలో తిరగనివ్వమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి తక్కువ మంది రావడంతో నాయకులపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి కనీసం 100 మంది కూడా సమావేశానికి తీసుకురాలేకపోయారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాసాని వెంకటేశ్వర్లు, మండల కోఆర్డినేటర్ పాలడుగు ప్రసాద్, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, మారుతి ఉపేందర్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

రైతులకు ఆదుకుంటున్న కేసీఆర్

చిలుకూరు : రాష్ట్రంలో రైతులను సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బేతవోలు గ్రామంలో చేపట్టిన రైతు యుద్ధవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గంటలు ఉచితంగా నాణ్యమైన కరెంట్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండా సైదయ్య, నలబోలు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, రైతు సమన్వయ సమితి జిల్లా, నాయకులు వెంకట్‌రెడ్డి, సురేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్లు జనార్దన్, సైదులు, వైస్ చైర్మన్ జానకీరామాచారి, గ్రామ అధ్యక్షుడు శ్రీను, సైదులు, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అంధకారమే

మోతె : తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో ఉందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో రైతు వేదికలో జరిగిన రైతుల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్లు కొండపల్లి వెంకటరెడ్డి, ముప్పాని శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పానుగోటి నర్సింహారావు, ఆరె లింగారెడ్డి, మద్ది మధుసుదన్‌రెడ్డి, ఎస్‌కే జానిపాష, నవిల రామకోటయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

హుజూర్‌నగర్ : క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ, బ్లాక్, మండల, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ బూత్, వార్డు, గ్రామ, మండల, బ్లాక్, నియోజకవర్గ స్థాయిలో పూర్తిస్థాయి కమిటీలు యుద్ధప్రాతిపదికన వేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ, మండల నాయకురాళ్లు బచ్చలకూరి రజిత, జి.జయమ్మ, ఎస్.సావిత్రి, ఎన్.పుల్లమ్మ, డి.వసంత, బి.మహాలక్ష్మి, జి.నిర్మల, వి.జయమ్మ, కె.శకుంతల, వెంకటమ్మ, సఫియా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్

మేళ్లచెరువు : ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కందిబండ గ్రామంలో న్యాయ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గృహహింస, వరకట్న వేధింపులు, మోటార్ వేహికిల్ యాక్ట్, రోడ్డు ప్రమాదాల నివారణ, భూచట్టాలపై వివరించారు. చిన్నపిల్లలు, ధరణీ సమస్యలు, వయో వృద్ధుల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్న,చిన్న క్రిమినల్, సివిల్ తగాదాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్ రావు, సర్పంచ్ అబ్రహ్మం, ఆనంద్‌నాయక్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.రాఘవరావు, కమతం నాగార్జున, సూపరింటెండెంట్ సైదానాయక్, ఆర్‌ఐ వాసు, రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



హుజూర్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు



హుజూర్‌నగర్‌లోని శాంతిస్థూపం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హుజూర్‌నగర్: దేశవ్యాప్తంగా మహిళలపై పెరిగిపోతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళల పట్ల కొందరు అమానుషంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని మట్టపల్లి బైపాస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి పీఎం మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగిస్తే రాష్ట్రం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని వెంటనే ఉరితీయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు పిచ్చమ్మ, నాయకురాళ్లు లక్ష్మమ్మ, మమత, పుల్లమ్మ, రేష్మ, వీరమ్మ, జాన్వి, ఫాతిమా, పద్మ, తిరుపతమ్మ, లక్ష్మి, రామనరసమ్మ, జానకి, రేణుక, మంగమ్మ, వీరమ్మ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం

మేళ్లచెరువు :మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని భారతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఉప్పతల కోటమ్మ, వీరమ్మ, వీరబాబు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ

హుజూర్‌నగర్ : మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ శుక్రవారం హుజూర్‌నగర్‌లో యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించి, శాంతిస్థూపం వద్ద ప్రార్థనలు చేశారు. అసోసియేషన్ జిల్లా, నియోజకవర్గ నాయకులు సుధాకర్, మెడి పౌలు, ఆండ్రియా, ప్రసాద్, డేవిడ్ రాజు, శామ్యూల్ గుండు, జాన్ పాల్, హానోక్ పీటర్, ఇస్సాకు, ఆదాము, అభిషేక్, సత్యానందం, జాకబ్, ఇమ్మానియేల్, పాస్టర్లు పాల్గొన్నారు.

సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్ ఘటన

కోదాడఅర్బన్ : మణిపూర్‌లో కూకి స్త్రీలపై జరిగిన అమానవీయ సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని కోదాడ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకియేషయ్య అన్నారు. శుక్రవారం కోదాడలోని నయానగర్‌లో గల బాప్టిస్ట్ చర్చిలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలో ముగ్గురు స్త్రీలను వివస్త్రలను చేసి అతి క్రూరంగా, పైశాచికంగా సామూహిక అత్యాచారం చేసి హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ రెవరెండం వి.యేషయ్య, రెవ. జోసఫ్‌రాజ్, పాస్టర్లు ప్రభుదాస్, రమేష్, పాల్‌చారి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హింసకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

మోతె : మణిపూర్‌లో హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లి కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో కూకి మహిళలకు వివస్త్రను చేసి లైగిక దాడి చేసి వారిని నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఇద్దరు దుండగలపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

నడిగూడెం : మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు జమ్మి యల్లయ్య, నాయకులు కాసాని రాంబాబు, కొరట్ల బ్రహ్మయ్య, వినోద్, సిద్ధు, కోటి, సైదులు, లింగయ్య, అంజి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

అనంతగిరి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని, చెత్త పెరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని పారిశుద్ధ్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్మికులు విధులకు హాజరుకాకపోవడంతో గ్రామాలలో మురికి కాల్వల్లో చెత్త పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీకి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధారవత్ రామ, ఎంపీడీఓ విజయ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం



ఆర్డీఓను సన్మానిస్తున్న తహసీల్దార్‌లు

హుజూర్‌నగర్ : మండలాల్లో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌గనర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తొలుత తహసీల్దార్‌లు ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత ఓటర్ల జాబితా రూపకల్పనలో బాధ్యతలు, విధులతో పాటు ఆగస్టు, అక్టోబర్ నెలల్లో జరిగే ప్రత్యేక ఓటర్ల జాబితా నమోదు తదితర అంశాల్లో శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, వాసుదేవరావు, శశిధర్, రవీందర్ బీఎల్ఓలు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక పూజలు

చిలుకూరు : పాత చిలుకూరులో నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయం వద్ద శనివారం, ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. విగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం హోమాలు, అమ్మవారికి పాల పొంగళ్లు, ఆదివారం అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించనున్నట్లు తెలిపారు. పూజల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అమిత్‌షా వీడియో ప్రసంగం వీక్షణ

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కామన్ సర్వీసు సెంటర్ల (సీఎస్‌సీ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా నిర్వహించిన జాతీయ సెమినార్‌ను శుక్రవారం మండలంలోని రత్నవరం గ్రామ ప్రజలు టీవీల్లో వీక్షించారు. కార్యక్రమంలో చెన్నకేశ్వాపురం సీఎస్‌సీ నిర్వాహకుడు మేకల నాగరాజు, శ్రీనివాస్, శోభారాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కోదాడరూరల్ : సమ్మెలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి విధుల్లోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం కోరారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లో డ్రెయినేజీలన్నీ మురుగుతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని అన్నారు. డ్రెయినేజీలు దోమలు, ఈగలకు నిలయంగా మారి డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు.

రైతుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



నేరేడుచర్ల : చిల్లెపల్లిలో పార్టీ బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



పాలకవీడు : గుడుగుంట్లపాలెం రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల : తెలంగాణలో రైతుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. విద్యుత్ సరఫరాపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మండలంలోని చిల్లెపల్లి గ్రామంలో గల రైతు వేదికలో రైతులతో కలిసి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తోందని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు మూడు గంటల విద్యుత్ చాలనడం తన అహంకారానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం లోఓల్టేజీ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వంటివి జరిగేవని, కేసీఆర్ సీఎం అయిన తరువాత రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు.. మూడు గంటలు సరిపోతుందన్న కాంగ్రెస్ కావాలా.. మత పిచ్చిలేపే బీజేపీ కావాలా..? రైతులకు మూడు పంటలు నీళ్లు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా.. రైతులే ఆలోచించుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు పేపర్ల పబ్లిసిటీ కోసం పోటీ పడుతున్నారని విమర్శించారు. అనంతరం దిర్శించర్లకు చెందిన యాతవాకిళ్ల ఈదమ్మకు రెండు లక్షల రూపాయల పార్టీ ప్రమాదబీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లకుమళ్ల జ్యోతిభిక్షం, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ కొణతం సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, లింగయ్య, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీను, శ్రీకాంత్ రైతులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి కేసీఆర్

పాలకవీడు : రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత పాలకుల హయాంలో వ్యవసాయంలో కష్టాలను రైతులు నేరుగా ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమాతో రైతులు ఆర్థికంగా పురోగమించారన్నారు. పాలకవీడు మండలంలో రోడ్లు, మూసీ నదిపై చెక్‌డ్యాంలు, కృష్ణానదిపై లిఫ్ట్ మంజూరు చేశామని తెలిపారు. సదస్సులో పార్టీ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు దుర్గారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాటికొండ వెంకట్‌రెడ్డి, తీగల వెంకట్‌రెడ్డి, శేషురెడ్డి, సైదులు, లక్ష్మారెడ్డి, సతీష్, సత్యనారాయణరెడ్డి, సోమిరెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గరిడేపల్లి మండలం కీతవారిగూడెంకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను వారికి అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.ధనమూర్తి అనారోగ్యానికి గురయ్యారు. శుక్రవారం గరిడేపల్లిలో ఎమ్మెల్యే సైదిరెడ్డి అతనిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ పెండెం సుజాతా శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వీరయ్య, రామారావు, అంజి, భాస్కర్, రమేష్, సతీష్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన కలిగి ఉండాలి

కోదాడ : ఎన్నికల విధులపై బూత్ స్థాయి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోదాడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం కోదాడలో జరిగిన నియోజకవర్గ బూత్ లెవల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను సక్రమంగా ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలంటే అధికారులు ఎన్నికల విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అధికారులు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరు మండలాల తహసీల్దార్, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మంత్రికి వినతి

మునగాల: మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ పరిధిలో 15 ఏళ్లుగా విద్యుత్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ పందిరి కళావతి భర్త, కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పందిరి నాగిరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం సూర్యాపేటలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డితోపాటు ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్‌రాజ్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ ముకుందాపురం గ్రామానికి ఆకుపాముల శివారులో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని, ఈ ఫీడర్ ఓవర్ లోడ్‌గా ఉండడంతో గ్రామాన్ని పాత, కొత్త ముకుందాపురాలుగా చేసి రెండు ఫీడర్‌లుగా బిభజించారన్నారు. గ్రామంలో సుమారు 300లకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు 11 కేవీ ఫీడర్‌పై నడుస్తుడడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా గ్రామానికి నూతన 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు వివరించారు. ఆయన వెంట వార్డు సభ్యులు ఉన్నారు.

సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం



నడిగూడెంలో ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు సమస్యలు వివరిస్తున్న పంచాయతీ కార్మికులు

హుజూర్‌నగర్‌రూరల్ : పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం బాధాకరమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హసన్‌మియా, ఉపాధ్యక్షుడు కొండల్, యల్లమ్మ, రత్నం, ప్రసాద్, అంజయ్య, వీరారెడ్డి, మైసయ్య, సైదులు, నాగరాజు, కాశమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 51ను రద్దు చేయాలి

గరిడేపల్లి : ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 51 తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవనంలో జరిగిన అఖిలపక్షం రౌండ్ టెబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్, సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు జనిగల శ్రీనివాస్, కీసరి నాగయ్య, బీఎస్పీ నాయకులు ఆర్. వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, రామస్వామి, ఎంపీటీసీలు సందీప్, రమేష్, చాంద్, భిక్షం, సీఐటీయూ నాయకులు రమేష్, సైదులు, సత్యం, నర్సిరెడ్డి, వెంకన్న జానయ్య తదితరులు ఉన్నారు.

కార్మికుల సమ్మెకు టీడీపీ మద్దతు

నడిగూడెం : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొంతగాని శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ వర్కర్ల సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లపు నాగేశ్వరరావు, నాయకులు సీతయ్య, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

మఠంపల్లి : జీఓ నంబర్ 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి, కనీస వేతనం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్ కోరారు. మండల కేంద్రంలో కార్మికుల సమ్మెకు సీపీఎం తరుపున శుక్రవారం సంఘీబావం తెలిపి మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, మోతీలాల్, పిచ్చయ్య, గురువారెడ్డి, దేవదానం, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కార్మికుల వినతి

నడిగూడెం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు నడిగూడెంలో గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. గత 16 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని, తమను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, పంచాయతీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు చిమట నాగరాజు, సుభాని, శ్రీకాంత్, వెంకన్న పాల్గొన్నారు.

ఎర్రవరానికి భక్తుల తాకిడితో ట్రాఫిక్ జామ్

- శుక్రవారం కావడంతో ఉగ్రనరసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఎర్రవరం చుట్టూ పది కిలోమీటర్ల మేర రోడ్డుపై నిలిచిన వాహనాలు
- ఇబ్బందులు పడిన వాహనదారులు



కోదాడ- మేళ్లచెరువు ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు

కోదాడరూరల్ : కోదాడ నుంచి ఎర్రవరం దూళ్లగుట్ట శ్రీలక్ష్మీ బాల ఉగ్రనరసింహస్వామి ఆలయం వద్దకు వెళ్లే రహదారిపై శుక్రవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇది కోదాడ- మేళ్లచెరువు ప్రధాన రహదారి. దీంతో మేళ్లచెరువు పరిసర ప్రాంతాల్లో సిమెంట్ పరిశ్రమలు ఉండటంతో పాటు అటువైపు ఉండే గ్రామాల ప్రజలు వివిధ పనులపై నిత్యం కోదాడకు వచ్చి వెళ్తుంటారు. దీనికి తోడు ఎర్రవరం ఆలయానికి శుక్ర, ఆదివారాల్లో వేలాదిగా భక్తులు వస్తున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయి ఇటు తొగర్రాయి, అటు కందిబండ వైపు, హుజూనగర్ వైపు దాదాపుగా 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, భక్తులు రెండు గంటల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం పడటంతో రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఖాళీ పొలాల్లో వాహనాలను పార్కింగ్ చేసే అవకాశం లేకపోవడంతో వాహనదారులకు సరైన అవగాహన లేకపోవడంతో ఉమ్మడి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు వాహనాలను రోడ్డుపక్కనే నిలిపారు. దీంతో భారీవాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు పక్కకు తీయలేక వాహనాలు ముందుకు కదలలేదు. రోడ్డుపై వాహనాల సంఖ్య భారీగా పెరిగి ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్థానిక యువకులు రంగంలోకి వాహనాలను క్రమబద్ధీకరించారు. ముందస్తుగానే రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తే ఈ సమస్య తలెత్తేది కాదని వాహనదారులు అంటున్నారు.